ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
శనివారం 15 జూన్ 2024 | 5





తూర్పున.. త్రి..నేత్రం!

ముగ్గురికి చంద్రబాబు మార్క్ మంత్రి పదవులు

చంద్రబాబా... మజాకానా.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ముగ్గురు మంత్రులకు శాఖలు కేటాయించారు.. శెహ'బాస్' అనిపించుకున్నారు.. జిల్లాను దృష్టిలో పెట్టుకుని అత్యంత కీలక శాఖలు కట్టబెట్టారు... జిల్లాలో గ్రామీణ ప్రాంతం చాలా ఎక్కువ... ఈ నేపథ్యంలో పల్లెల దశ, దిశ మారుస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖలను కేటాయించారు. మరో మంత్రి కందుల దుర్గేష్‌కు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలను కేటాయించారు... ఇటు గోదావరి నుంచి అటు ఏజెన్సీ వరకు... మరోపక్క ఎంతో అందమైన కడియపులంకను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లాలో ఎంతో అవకాశం ఉంది. ఇక మూడో మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. మన జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు.. పరిశ్రమల కార్మికులు ఎక్కువే.. ఇలా మూడు శాఖలు 'తూర్పు'నకు త్రినేత్రమే....

- కీలక శాఖలు అప్పగింత
- పల్లెల బాధ్యత పవన్‌కు..
- జిల్లాలో గ్రామాల విస్తీర్ణమే ఎక్కువ
- సురక్షిత తాగునీటికీ ఆయనే దిక్కు
- పర్యాటకానికి కేరాఫ్‌గా దుర్గేష్
- జిల్లాలో గోదావరి.. సముద్రం
- కార్మికుల సమస్యలు తీర్చేలా సుభాష్
- జిల్లావ్యాప్తంగా బోలెడు పరిశ్రమలు
- లక్షలాదిగా భవన నిర్మాణ కార్మికులు
- 'తూర్పు' దశ మారేలా కేటాయింపులు

పవన్.. పంచాయతీరాజ్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు అత్యంత కీలక శాఖలు లభించాయి. మంత్రులకు శుక్రవారం శాఖల కేటాయింపు జరగ్గా అందులో భాగంగా సీఎం చంద్రబాబు పవన్‌కు అత్యంత ముఖ్యమైన బాధ్యతలు కట్టబెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్), అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. అటు డిప్యూటీ సీఎం పదవి కూడా కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకరకంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సురక్షిత తాగునీరు, ఇంటింటికీ కుళాయి తదితర పనులన్నీ ఈ శాఖల ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. దీంతో జిల్లాలో అత్యధికంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది మంత్రులుగా పనిచేశారు. అయితే పీఆర్, రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు ఇంతకు ముందు ఎవరికీ దక్కలేదు. ఏ ప్రభుత్వంలో అయినా ఈ కీలక శాఖలను అత్యంత సీనియర్ మంత్రులకే కేటాయించేవారు. కానీ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం హోదాలో ఈ ముఖ్యమైన శాఖలను కట్టబెట్టడం విశేషం. వాస్తవానికి ఈ శాఖలు పూర్తిగా గ్రామీణ మండలాలకు సంబంధించినవి. అటు పవన్‌కు కూడా ఈ శాఖల ద్వారా గ్రామాల రూపురేఖలను మార్చాలనే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో అవే దక్కడం విశేషం. పవన్ కల్యాణ్ ఒకట్రెండు రోజుల్లో తనకు కేటాయించిన శాఖల బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రధానంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి జిల్లాలో అనేక పనులు చేపట్టడానికి వీలుంది. ఈ శాఖ పరిధిలోకి పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు రానున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి, వాటి రూపురేఖలను మార్చడం ఈ శాఖ ద్వారానే సాధ్యం. ఈ శాఖకు అటు రాష్ట్రం, ఇటు కేంద్రం నుంచి సైతం నిధులు భారీగా వస్తాయి. తద్వారా జిల్లాలో పంచాయతీలపై దృష్టిపెట్టి వాటిని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి పవన్‌కు అవకాశం కలిగిందనే చెప్పాలి. ప్రధానంగా పిఠాపురం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతం ఎక్కువ. తనకు దక్కిన శాఖల ద్వారా నియోజకవర్గంలో పంచాయతీలను ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి బాట పట్టించడానికి పవన్‌కు మార్గం సుగమమైందనే చెప్పాలి. గ్రామీణ నీటిసరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యుఎస్) శాఖ మంత్రిగా పవన్‌కు గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడానికి గట్టిగా పనిచేసే అవకాశం లభించిందనే చెప్పాలి. ఇంటింటికీ తాగునీటి కుళాయి పథకం ఈశాఖ పరిధిలోకే వస్తుంది. ఇప్పటికే కేంద్రం జాతీయ జలమిషన్ కింద జిల్లాకు రూ.500కోట్లకుపైగానే కేటాయించింది. కానీ గత వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేదు సరికదా, ఇంటింటికీ కుళాయి పనులను గాలికొదిలేసింది. ఇంటింటికీ సురక్షిత తాగునీరు పథకాన్ని ఎన్నికలకు ముందు టీడీపీ తన సూపర్ సిక్స్‌లో ప్రకటించింది. జిల్లాకు ఈ శాఖ ద్వారా భారీగా నిధులు పవన్ కేటాయించి పనులు చేయించే అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కలుషిత నీరు తాగి తొండంగి మండలంలో రెండు రోజులుగా 300 మంది వరకు డయేరియా బారిన పడ్డారు. ఇందులో ఒకరు శుక్రవారం మృతి చెందారు. కలుషిత నీటి మరణాలు లేకుండా గ్రామీణనీటి సరఫరాశాఖ ద్వారా జిల్లాతో పాటు పిఠాపురం నియోజకవర్గానికి సైతం భారీగా నిధులు కేటాయించవచ్చు. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు పవన్‌కే దక్కాయి. ఆయా శాఖల్లో గత ప్రభుత్వ అరాచకాలపై విచారణ చేయడంతో పాటు ఇకపై వీటి ఉల్లంఘనలు జరగకుండా పవన్ దృష్టిసారించాల్సి ఉంది.

దుర్గేష్‌కు.. పర్యాటకం

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.. ఇది జిల్లా వాసులు పదేపదే అనేమాట.. ఆ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకున్నారో ఏమో కానీ జిల్లా నుంచి నిడదవోలు ఎమ్మెల్యేగా ఎన్నికైన కందుల దుర్గేష్‌కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖలను కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిడదవోలు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కింది. ఇప్పటివరకూ జిల్లాకు పర్యాటక శాఖ కేటాయించిన దాఖలాలు లేవు. తొలిసారి ఆ పర్యాటక శాఖ దక్కడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటకానికి ఎంతో అవకాశం ఉంది. ఒకపక్క ఉభయగోదావరి జిల్లాల్లో ఎంతో అందమైన గోదావరి.. మరోపక్క చూసే కొద్దీ చూడాలనిపించే సముద్రం.. ఇంకోపక్క మడ అడవులు.. ఏజెన్సీ.. అక్కడ జాలువారే జలపాతాలు.. ఇక షూటింగ్‌లు చేసుకోవడానికి ఎంతో అందమైన ప్రకృతి.. సాంస్కృతికపరంగా రాజమహేంద్రవరానికి పెద్ద పేరు.. ఇవన్నీ ఆలోచించే దుర్గేష్‌కు ఆ శాఖలు కేటాయించి ఉంటారని జనం భావిస్తున్నారు.. గత పుష్కరాల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అఖండ గోదావరిలో బోటు మీద స్వయంగా పర్యటించి అఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్లో రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరం కేంద్రంలో ఈ ప్రాజెక్టు కార్యాలయం ఏర్పాటు చేశారు. పిచ్చుకలంకను అభివృద్ధి చేయాలని, హేవలాక్ బ్రిడ్జిని తీర్చిదిద్దాలని, రాజమండ్రిలోని చారిత్రక కట్టడాలను, ప్రాంతాలను పర్యాటక హబ్‌గా మార్చాలని ప్రయత్నం చేశారు. పాపికొండలును అభివృద్ధి చేయాలనుకున్నారు. కాకినాడ హోప్ ఐలాండ్, కోరంగి మడ అడవులు, కోనసీమ ప్రాంతాలను అభివృద్ధి చేసి టూరిజానికి తగినట్టు హోటళ్లు, రిసార్ట్స్ అభివృద్ధి చేసే ప్రయత్నం చేశారు. కానీ జగన్ నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అఖండ గోదావరి ప్రాజెక్టు మూతపడింది. పర్యాటక రంగాన్ని అస్సలు పట్టించుకోలేదు. గోదావరి జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి ఆగిపోయింది. టూరిజం పట్ల అభిరుచి ఉన్న చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం, ఈ ప్రాంత అభివృద్ధిని కోరుకునే కందుల దుర్గేష్‌కి పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలు దక్కడంతో ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందనుంది. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా రాజమహేంద్రవరం వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌కు సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. సుమారు 4 గంటలకు ధవళేశ్వరం వచ్చిన మంత్రి దుర్గేష్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరడానికి మూడున్నర గంటలు పట్టింది. అదే సమయంలో వర్షం రావడంతో తడుస్తూనే ర్యాలీ కొనసాగించారు.

కార్మిక శాఖకు..సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14: కార్మికులు కష్టాలు తీరనున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎటు చూసినా పరిశ్రమలు అధికం. మరో వైపు భవన నిర్మాణ కార్మికులు ఎక్కువే. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో గతం నుంచీ ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడిన తరువాత సుభాష్ తొలిసారి మంత్రి పదవి చేపట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంతో మంది మంత్రులుగా పనిచేశారు. ఇప్పటివరకు ఎవరూ కార్మిక శాఖను చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులతో పాటు అనేక ఇతర రంగాలకు చెందిన కార్మికులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అనేక సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయి. కార్మిక సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించారని విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు ద్వారా అమలు జరిగే అన్ని పథకాలు నిలిచిపోయాయి. దీంతో కార్మికులు తీవ్ర ఆవేదన చెందారు. ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లాకు కార్మికశాఖ దక్కడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక శాఖ కేటాయించిన వెంటనే మంత్రి సుభాష్ విజయవాడలో కార్మిక శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పథకాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని మంత్రి సుభాష్ ప్రకటించడంతో కార్మికులు, కార్మిక సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బాలబాలాజీ స్వామికి కల్యాణ తిలకం దిద్దుతున్న అర్చకస్వాములు

బాలబాలాజీ స్వామి పెండ్లి కొడుకాయెనే

- అప్పనపల్లిలో కల్యాణోత్సవాలకు శ్రీకారం

మామిడికుదురు, జూన్ 14: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాలు ఆరంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇతర అర్చకులు స్వామివారికి కల్యాణ తిలకాన్ని దిద్ది పెండ్లి కొడుకును చేశారు. అనంతరం ఈవో జి.మాధవి పందిరి రాట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రాటను పాతారు. వేద పండితులు జి.శ్రీనివాసాచార్యులు, జె.సోమయాజులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. బొక్కా సత్యమూర్తి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పందిరి రాటకు పూజలు చేస్తున్న అర్చకులు, ఈవో మాధవి

బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోవాలి

ముమ్మిడివరం, జూన్ 14: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ రాని విద్యార్థుల వివరాలను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని ఎగ్జామినేషన్ బోర్డు అసిస్టెంట్ కమిషనర్ నక్కా సురేష్ తెలిపారు. 2019 నుంచి 2022 వరకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికై ప్రస్తుతం 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు, రెన్యువల్ చేసుకున్నప్పటికీ వారి బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ చేయని కారణంగా స్కాలర్‌షిప్ జమ కాలేదన్నారు. వారి వివరాలను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. జాబితాలో పేరు ఉన్న ప్రతి విద్యార్థి వెంటనే తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నగదు జమ అయ్యే విధంగా ఏర్పాటు చేసుకోవాలని లేకపోతే స్కాలర్‌షిప్ జమ కాదన్నారు. దీనికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం, విద్యార్థి లాగిన్‌లో స్టేటస్ ప్రింట్ తీసుకుని సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆధార్ లింకు చేయించుకోవాలన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల హెచ్‌ఎంలు తగిన చర్యలు తీసుకోవాలని సురేష్ సూచించారు.



బోడసకుర్రు కాల్వపై బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కోనసీమ రైతు పరిరక్షణ సంఘం నేతలు

సాగునీరివ్వకపోతే ఉద్యమిస్తాం

- పంట విరామం పాటిస్తాం
- కోనసీమ రైతు పరిరక్షణ సంఘం నేతల హెచ్చరిక

అల్లవరం, జూన్ 14: బెండా కాల్వకు అధికారులు యుద్ధప్రాతిపదికన సాగునీరు ఇవ్వకుంటే పంట విరామం పాటించడంతో పాటు రైతు ఉద్యమం చేపడతామని కోనసీమ రైతుపరిరక్షణ సంఘం నేతలు హెచ్చరించారు. అల్లవరం మండ లం బోడసకుర్రు వద్ద బెండా కాల్వపై రూ.1.5 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనుల వల్ల ఇరిగేషన్ అధికారులు సాగునీరవ్వకుండా జాప్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. కోనసీమ రైతు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, జిల్లా కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, తెలుగు రైతు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు వేగిరాజు వెంకట్రాజు, అల్లవరం మండల శాఖ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణరావు బోడసకుర్రు వద్ద పంటకాల్వపై బ్రిడ్జి పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం అమలాపురంలోని కలెక్టరేట్‌కు వెళ్లి రైతుల సాగునీటి సమస్యలపై డీఆర్వోకు ఫిర్యాదు చేశారు. అల్లవరం మండలంలోని 21 గ్రామాలకు అధికారుల నిర్లక్ష్యం వల్ల సాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. పంట కాల్వలో ఇప్పటికే ఆక్వా చెరువుల ఉప్పునీరు నిండిపోయిందని, వేలాది ఎకరాలు ఖరీఫ్ సాగు లేక పంట విరామం పాటించే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఖరీఫ్ సాగులో జాప్యం జరిగితే వర్షాలు, తుపాను ఇబ్బందులు తప్పవని, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే నేటికీ సాగునీరు అందలేదని ఆరోపించారు. ఇరిగేషన్ డీఈఈ సాగునీరు విడుదల చేశామని చెప్తున్నా.. బ్రిడ్జి పనుల వల్ల దిగువకు నీరు వెళ్లలేదని రైతులు ఆరోపించారు. బెండా క్వాలకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాలని డిమాండు చేశారు.



పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లిలో అన్న క్యాంటీన్ వద్ద భోజనం కోసం బారులు తీరిన జనం

మళ్లీ అన్న క్యాంటీన్లు

- రూ.5కే అల్పాహారం, భోజనం పెట్టే ఏర్పాట్లు
- సామాన్యుల హర్షం

మండపేట, జూన్ 14: టీడీపీ హయాంలో ప్రారంభమై వైసీపీ పాలనలో మూతపడ్డ అన్న క్యాంటీన్లను మరలా తెరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పట్టణాలకు వివిధ పనులపై వచ్చిన వారితో పాటు పేదలు, సామాన్యుల ఆకలిని అన్న క్యాంటీన్లు తీర్చేవి. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు సంబంధించిన ఫైలుపై సంతకం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల వాటిని వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టారు. మండపేట ఏడిద రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను మున్సిపాలిటీ సిబ్బంది మూడు రోజులుగా శుభ్రం చేస్తున్నారు. వీటిని ఈ నెల 20న ప్రారంభిస్తారని తెలుస్తోంది. జిల్లాలో మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం పట్టణాల్లో అన్న క్యాంటీన్లు నిర్వహించేవారు. అమలాపురంలో అన్న క్యాంటీన్‌కు సొంత భవనం లేదు. ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేటల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సొంత భవనాలు నిర్మించారు. మండపేటలో అలాగే ఉండగా రామచంద్రపురం, ముమ్మిడివరంల్లోని భవనాలను ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్కడ కూడా అన్న క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నారు. మొత్తం మీద రూ.5కే భోజనం, అల్పాహారం అందించేందుకు క్యాంటీన్లను సిద్ధం చేస్తుండడంతో తమకు కడుపునిండా బువ్వ దొరుకుతుందని సామాన్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మండపేటలో అన్న క్యాంటీన్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

వాడ్రేవుపల్లిలో ఎనిమిది నెలలుగా నిరుపేదలకు భోజనం

పి.గన్నవరం, జూన్ 14: గతేడాది నవంబరులో నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లి ప్రధాన రహదారి చెంతనే ఎన్ఆర్‌ఐలు ఉండవల్లి సత్యనారాయణమూర్తి, తాళ్లూరి శ్రీకాంత్ ఆర్థిక సహాయంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. దీని ప్రారంభోత్సవానికి టీడీపీ జిల్లా, స్థానిక నాయకులతో పాటు అప్పటి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు (ప్రస్తుతం మంత్రి) కూడా హాజరయ్యారు.

ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు స్వాధీనం

అమలాపురం టౌన్, జూన్ 14: జిల్లాలో అక్రమ మద్యం రవాణాను అరికట్టడంతో పాటు మత్తు పదార్థాలపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే సదరు వ్యక్తులను అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య ఆధ్వర్యంలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి 12 ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కొత్తపేట డీఎస్పీ కె.వెంకటరమణ, రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో మడికి గ్రామానికి చెందిన మార్గాని చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అమలాపురం, ముమ్మిడివరం పోలీసుస్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రెండు కేసులు నమోదు చేశారు.

పొట్టకూటి కోసం వెళ్లి పరలోకానికి...

కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం... ఐదుగురు దుర్మరణం

కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన ఇద్దరు, కాట్రేనకోన మండలం గెద్దనపల్లికి చెందిన ఇద్దరు, కరప మండలం గొర్రిపూడికి చెందిన ఒకరు మృత్యువాత

మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

...వివరాలు 7లో, మెయిన్‌లో



కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో మృతుడు లోవరాజు ఇంటి వద్ద విషాదఛాయలు

పొట్టకూటి కోసం వెళ్లి పరలోకానికి..

- కృష్ణా జిల్లా రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లావాసులు నలుగురి మృతి
- కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడికి చెందిన మరొకరు మృత్యువాత
- మరో అయిదుగురికి తీవ్ర గాయాలు
- ఎస్.యానాం, గెద్దనపల్లి, గొర్రిపూడి గ్రామాల్లో తీవ్ర విషాదచాయలు

ఉప్పలగుప్తం, జూన్ 14: కృష్ణా జిల్లా కృత్తివెన్ను వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన రేవు భూషణం (26), పెసంగి కనకరాజు (32) అక్కడికక్కడే మృతి చెందారు. కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందిన చింతా లోవరాజు, మాగాపు నాగరాజు మృతి చెందగా, తీవ్రగాయాలపాలైన చింతా దుర్గాప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరితోపాటు ప్రయాణిస్తున్న యువకులు రేవు జ్ఞానేశ్వరరావు, సంగాని నాగేంద్రబాబు, మల్లాడి శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా చేపల పట్టుబడి కోసం కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి బొలెరో వాహనంలో వెళ్తుండగా చేపల కంటైనర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఎస్.యానాం, గెద్దనపల్లిలో విషాదచాయలు నెలకొన్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పని కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు...

కుటుంబాలను పోషించుకునేందుకు రోజూ మాదిరిగానే ఇంటి నుంచి బయలుదేరారు. శుక్రవారం ఉదయమే కుటుంబ సభ్యులకు విషాద వార్త అందింది. దీంతో ఎస్.యానాంలో విషాదం నెలకొంది. ప్రతిరోజూ రాత్రి ఎస్.యానాం నుంచి కొందరు యువకులు చేపల పట్టుబడికి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. పలు గ్రామాల నుంచి తాళ్లరేవు వెళ్లి అక్కడి నుంచి అందరూ కలిసి చేపల పట్టుబడి ప్రాంతాలకు వాహనాలపై వెళ్తారు. గురువారం అర్ధరాత్రి అదే విధంగా 12 మంది బొలేరో వాహనంలో బయలుదేరి వెళ్లారు. ఆ ప్రయాణమే కొందరికి ఆఖరి పయనం అయ్యింది. కాగా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన మృతుడు రేవు భూషణానికి ఏడాది కిందటే వివాహమైంది. అతడి భార్య జ్యోతి గర్భవతి. మరో మృతుడు కనకరాజుకు భార్య, కూతురు ఉన్నారు. రోజూ మాదిరిగానే ఇంటికి అవసరమైన సామగ్రి తీసుకుని వస్తారని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులను ఇక తమవారు లేరన్న సమాచారం నిలువునా కుంగదీసింది. మృతుల కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కనకరాజు పిల్లలు తండ్రి కోసం పదేపదే అడుగుతుంటే ఇరుగుపొరుగు వారు సముదాయించలేక కన్నీరు పెట్టుకుంటున్నారు. గర్భవతిగా ఉన్న జ్యోతి తన భర్త ఇక లేడన్న వార్తను జీర్ణించుకోలేక విలపిస్తున్న తీరు వర్ణనాతీతం. ఎంపీటీసీ పెట్టా అప్పారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, లంకే చిరంజీవిలు ప్రమాదస్థలికి వెళ్లి పర్యవేక్షించారు.



కరప మండలం గొర్రిపూడిలో మృతుడి ఇంట రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పిల్లలకు, తల్లికి.. దిక్కెవరు?

కాట్రేనికోన, జూన్ 14: ఇదే ప్రమాదంలో కాట్రేనికోన మండలం గెద్దనాపల్లికి చెందిన మాగాపు నాగరాజు మృతితో అతని కుమారుడు సతీష్, కుమార్తె చంద్రికశ్రీ, తల్లి సూర్యకాంతం దిక్కులేనివారయ్యారు. ప్రేమ వివాహం చేసుకున్న నాగరాజు మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నాడు. దీంతో కుమార్తె చంద్రిక తండ్రి వద్ద, కుమారుడు సతీష్ తల్లి వద్ద ఉంటున్నారు. వృద్ధురాలైన తల్లి నాగరాజు వద్ద ఉంటోంది. రాత్రి వరకు తన ముందు కదలాడిన కుమారుడు మృతి చెందాడన్న విషయాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది. తండ్రి ఎప్పుడు తిరిగివస్తాడని కుమార్తె అమాయకంగా అడుగుతోంది. నాగరాజు కూలిపనితో జీవిస్తుండగా, ఇప్పుడా కుటుంబం జీవనాధారం కోల్పోయింది. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన చింతా లోవరాజు మృతి వార్త విన్న అతడి భార్య విజయ, తల్లిదండ్రులు సత్యనారాయణ, గంగాయమ్మ కుప్పకూలిపోయారు. లోవరాజు కుమార్తె దేవిశ్రీ, కుమారుడు హేమంత్ విషయం అర్థం కాక బేలచూపులు చూస్తున్నారు. మత్స్యకారులైన వీరికి చేపలవేటే ఆధారం. వేటలేని సమయంలో చేపల ప్యాకింగ్, ఇతర పనులకు వెళ్లి లోవరాజు కుటుంబ పోషణ చేస్తుంటాడు. ఈ సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడి మరణంతో వృద్ధులైన తల్లిదండ్రులు, చిన్న వయసులో భర్త మరణించడంతో ఇద్దరు పిల్లలతో ఎలా జీవించాలంటూ లోవరాజు భార్య విజయ బోరున విలపించడం అందరినీ కలచి వేసింది.



కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో నాగరాజు ఇంటి వద్ద విషాదచాయలు



గెద్దనపల్లిలో రోదిస్తున్న లోవరాజు భార్య, పిల్లలు

కృత్తివెన్ను రోడ్డు ప్రమాదంలో గొర్రిపూడి వాసి మృతి

కరప, జూన్14: రెక్కాడితే గాని డొక్కాడని బతుకులను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. కుటుంబాలకు ఆధారభూతమైన వారిలో ఒకరిని మృత్యువు కబళించగా, మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలయ్యాడు. దీంతో రెండు కుటుంబాలు రోడ్డునపడి గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలముకున్నాయి. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మవరప్రసాద్ (27) మృత్యువాత పడగా, మేడిశెట్టి మహేష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గొర్రిపూడి గ్రామానికి చెందిన ధర్మవరప్రసాద్, మహేష్‌కుమార్ ఒక చేపల కంపెనీలో పనిచేస్తున్నారు. ధర్మవరప్రసాద్ డ్రైవర్‌గాను, మహేష్‌కుమార్ గుమస్తాగాను విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మరో తొమ్మిది మందితో కలిసి కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామంలో చేపల పట్టుబడికి బొలెరో వాహనంలో బయలుదేరి వెళ్లారు. సీతనపల్లి వద్ద వుల్లల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తూ ముందున్న కంటైనర్‌ను వీరు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ధర్మవరప్రసాద్‌తో పాటు మరో ఐదుగురు మృత్యువాతపడ్డారు. మహేష్ కుమార్ తలకు, నడుముకు తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుప్రమాద విషయం తెలిసిన వెంటనే గొర్రిపూడి నుంచి రెండు కుటుంబాలకు చెందిన పలువురు ఘటనాస్థలికి చేరుకున్నారు. ధర్మవరప్రసాద్ మృతిచెందిన విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు బోరున విలపించారు. అతడికి ఏడాదిన్నర పాప, భార్య వరలక్ష్మి ఉండగా ఆమె ప్రస్తుతం నిండు గర్భిణి. తండ్రి సత్యనారాయణమూర్తి దివ్యాంగుడు కాగా, తల్లి వరలక్ష్మి వినికిడిలోపం సమస్యతో బాధపడుతోంది. వీరితోపాటు వృద్ధాప్య దశలో ఉన్న తాత ధర్మారావు బాధ్యతలు కూడా మృతుడు ధర్మవరప్రసాద్ చూసుకుంటున్నాడని, ఇప్పుడు తమకెవరు దిక్కంటూ బాధితుల ఆక్రందనలు చూపరులను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోపక్క భర్త చనిపోయిన విషయం పుట్టింట్లో ఉంటున్న అతని భార్యకు ఎలా చెప్పాలి దేవుడా అంటూ కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. ఇక ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్‌కుమార్ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నారు.

మేనల్లుడి చేతిలో మేనమామ హతం

నాపరాయితో కొట్టి చంపిన వైనం





వరప్రసాద్.. మృతదేహం

పిఠాపురం రూరల్, జూన్ 14: మేనల్లుడి చేతిలో మేనమామ హతమయ్యాడు. నాపరాయితో కొట్టి హతమార్చిన ఘటన పిఠాపురం మండలం భోగాపురంలో సంచలనం కలిగించింది. గ్రామానికి చెందిన బ్రహ్మదేవపు వరప్రసాద్(44), నాగులాపల్లి పద్మరాజులు వరుసకు మేనమామ, మేనల్లుడు. వీరిద్దరు తాపీ పనికి వెళుతూ తమ కుటుంబాలను పోషించుకుంటారు. వీరి కుటుంబాల మధ్య కొంతకాలంగా కలహాలు ఉన్నాయి. గురువారం రాత్రి పనికి వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత వీరిద్దరి మధ్య కూలీ డబ్బుల విషయంలో ఘర్షణ జరిగింది. అనంతరం ఎవరికి వారు వెళ్లిపోయారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయంలో గుడిలో నిద్రిస్తున్న వరప్రసాద్‌ను పద్మరాజు నాపరాయితో కొట్టి హత్య చేశాడు. దీంతో రక్తపు మడుగులో పడి వరప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. పద్మరాజు పరారయ్యాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వరప్రసాద్ సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సముద్రంలో స్నానానికి దిగి యువకుడు మృతి

ఉప్పలగుప్తం, జూన్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్‌లో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒక యువకుడు మృతి చెందాడు. మృతి చెందిన యువకుడిని విశాఖపట్నానికి చెందిన అనుదీప్(24)గా గుర్తించారు. ఎస్.యానాంలో ఒక ఓఎన్జీసీ ఉద్యోగిని కలుసుకునేందుకు ముగ్గురు యువకులు విశాఖ నుంచి శుక్రవారం వచ్చారు. వీరు బీచ్‌లో స్నానం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అనుదీప్ సముద్రంలో తేలుతుండగా వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి కెయిర్న్ అంబులెన్స్‌లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారణ కావడంతో వెంటనే విశాఖకు తరలించారు. శుక్రవారం 11-12 గంటల మధ్య ఈ ప్రమాదం జరిగిందని, తమకు సమాచారం తెలిసిన వెంటనే అమలాపురం ఆసుపత్రికి వెళ్లగా అప్పటికే మృతదేహాన్ని విశాఖ తరలించారని వీఆర్వో అవిడి రాము చెప్పారు.

ఆడుకునేందుకు ఆటో కిందకు.. గమనించకుండా ముందుకు నడిపిన డ్రైవర్

నాలుగేళ్ల బాలుడు దుర్మరణం



పిఠాపురం రూరల్, జూన్14: ఆటలు ఆడుకుంటూ ఆటో కిందకు దూరాడు నాలుగేళ్ల బాలుడు. అది గమనించకుండా ఆటోను డ్రైవర్‌కు ముందుకు నడపడంతో కిందపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషాదకర ఘటన పిఠాపురం మండలం పి.దొంతమూరులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కుక్కల అశ్విన్(4) శుక్రవారం ఆడుకుంటూ ఉన్నాడు. అదే సమయంలో గ్రామంలో ఉప్పు అమ్ముతూ వచ్చిన ఆటో అక్కడ ఆగింది. అశ్విన్ ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లాడు. అది గమనించని డ్రైవర్ ఆటోను ముందుకు నడిపాడు. దీంతో ఆటో కింద ఉన్న అశ్విన్ మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. తండ్రి వెంకట్రావు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తాడు. అశ్విన్‌కు రెండేళ్ల తమ్ముడు ఉన్నాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి

నేరేడు చెట్టు ఎక్కడంతో విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం



ప్రత్తిపాడు, జూన్14: నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ధర్మవరంనకు చెందిన బెజవాడ భాస్కరరావు (39) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై చెట్టు మీద నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న భాస్కరరావును స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. భాస్కరరావుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుడుగా రోజువారీ పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న భాస్కరరావు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో అతని కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరేడు చెట్టు నుంచి జారి పడి యువకుడి మృతి



రాజానగరం, జూన్14: నేరేడు చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా చెట్టు కొమ్మ విరిగిపడి ఒక యువకుడు మృతిచెందాడు. రాజానగరం మండలం పాలచర్ల గ్రామానికి చెందిన దేవాబత్తుల శివనాగ దుర్గ (27) పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం నేరేడు చెట్టు ఎక్కి పండ్లు కోస్తుండగా కొమ్మ విరిగిపోవడంతో ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా దుర్గ భార్య కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.





లారీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు.. పక్కన బండారు స్వామి (ఫైల్‌ఫొటో)

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రౌతులపూడి, జూన్14: వివాహమై సంవత్సరం అయ్యింది. హాయిగా సాగిపోతున్న కాపురంలో లారీ రూపంలో మృత్యువు వచ్చి భర్తను పొట్టన బెట్టుకుంది. భార్య ఒంటరికాగా, ఒక్కగాన ఒక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల ఆర్తనాదాలతో ఆ గ్రామం శోకసంద్రంలో మునిపోయింది. రౌతులపూడి మండలం పారుపాక గ్రామానికి చెందిన బండారు స్వామి (21) తుని వేళ్లే రహదారిలోని మామిడితాండ్ర ఫ్యాక్టరీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంవత్సరం కిందట పారుపాక గ్రామానికి చెందిన పార్వతితో వివాహమైంది. ఫ్యాక్టరీలో పని ముగించుకుని వస్తుండగా తేటగుంట- తుని సెంటర్‌లో క్వారీ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మృతి చెందిన విషయం తెలిసిన భార్య బండారు పార్వతితో పాటు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కడే కొడుకు కావడం, సంవత్సరం కిందటే వివాహం కావడంతో తల్లిదండ్రులు రోదనకు అంతు లేకుండా పోయింది. కాగా ఈ ప్రమాదంలో స్వామి మృతికి కారణమైన లారీ యాజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. లారీలు ఈ రహదారిలో వేగంగా నడుపుతున్నారని, ఇలా ఎంతమందిని చంపేస్తారంటూ గ్రామస్తులు నిలదీశారు. రౌతులపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

కొమ్మనాపల్లిలో అదుపులోకి రాని డయేరియా

- మహిళ మృతి
- ఎమ్మెల్యే దివ్య పరామర్శ
- జిల్లా అధికారుల సందర్శన
- ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా
- కారణం నిర్ధారించని అధికారులు





రోగుల్ని పరామర్శిస్తున్న యనమల దివ్య (కింద) మృతి చెందిన నాగమణి

తొండంగి, జూన్14: కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా వ్యాధి ఇంకా అదుపులోకి రాలేదు. శుక్రవారం కొత్తగా మరో 11 కేసులు నమోదయ్యాయి. దొడ్డి నాగమణి (35) అనే మహిళ డయేరియా వ్యాధితో మృతి చెందడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. నాగమణికి వాంతులు అవుతుండడంతో శుక్రవారం ఉదయం సీతంపేట ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మరణించింది. నాగమణికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో ఆందోళన నెలకొంది. కొత్తగా నమోదైన కేసులతో ఇప్పటివరకూ అధికారికంగా 34 కేసులు నమోదైనప్పటికీ ఇంకా పలువురు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్టు గ్రామస్తులు తెలుపుతున్నారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతిలు చికిత్స అందిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి రోగుల్ని గుర్తిస్తున్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి బ్లీచింగ్ క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. సచివాలయంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇప్పటికే సుమారు 10 మందిని అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్య శిబిరం వద్ద అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్, జిల్లా పంచాయతీ అధికారి సౌజన్యలు గ్రామంలో పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ శాంపిళ్లు సేకరించి పరీక్షకు పంపినట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాస్ తెలిపారు.

రోగులు ధైర్యంగా ఉండాలి: ఎమ్మెల్యే దివ్య

డయేరియా రోగులు మనోధైర్యంతో ఉండాలని తుని ఎమ్మెల్యే దివ్య అన్నారు. శుక్రవారం ఆమె కొమ్మనాపల్లి వైద్య శిబిరంలో రోగుల్ని పరామర్శించారు. జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్, ఎస్ఈ శ్రీనివాస్ తదితర అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. అవసరమైతే తక్షణం కాకినాడ తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించామన్నారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకటరమణ ఆమె వెంట ఉన్నారు. కాగా గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలడానికి ఆహారం లేదా నీటి కాలుష్యం కారణంగా ఏర్పడి ఉండవచ్చని జిల్లా వైద్యాధికారి నాయక్ తెలిపారు. రోగుల శరీరంలో ఇన్‌ఫెక్షన్ స్థాయి అధికంగా ఉండడం వల్ల ప్రధానంగా కలుషిత ఆహారం భుజించి ఉండవచ్చన్నారు. నీటి శాంపిళ్లు సేకరించి పరిశీలించామని, శాంపిళ్లను కాకినాడ ల్యాబ్‌కు కూడా పంపి పరీక్ష చేయిస్తామన్నారు. అంతవరకూ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పైప్‌లైన్ల లీకుల కారణంగా డ్రైనేజీ వాటర్ తాగునీటిలో కలిసి వ్యాధి ప్రబలి ఉండవచ్చని పలువురు అధికారులకు తెలపగా అటువంటిది లేదన్నారు. ఆర్డీవో సీతారామాంజనేయులు, డీఎల్‌పీవో గ్రామాన్ని సందర్శించారు.





పోటీల్లో పరుగులు తీస్తున్న ఎడ్ల బండి.. ప్రథమ బహుమతి అందజేస్తున్న తమ్మయ్యబాబు

రాష్ట్ర స్థాయి ఎడ్లపోటీల్లో విజేతలు వీరే

ఏలేశ్వరం, జూన్14: మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎడ్లబళ్ల పోటీలకు సీనియర్ విభాగంలో 7జతలు, జూనియర్ విభాగంలో 27 జతలు పాల్గొన్నాయి. వీటిలో సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అనకాపల్లి జిల్లా లంకెవానిపాలెం గ్రామానికి చెందిన శ్రీపైడితల్లి అమ్మ, మండపేట గ్రామానికి చెందిన పెనుమర్తి బొబ్బిలి రాజు, కొవ్వాడ గ్రామానికి చెందిన మట్లాన వనీత్ శ్రీమణికంఠ వారి ఎడ్లు గెలుపొందగా, జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కొప్పవరం గ్రామానికి చెందిన బండారు శ్రీను, దుళ్ల గ్రామానికి చెందిన తూము శ్రీను, కొవ్వాడ గ్రామానికి చెందిన మట్లాన వనీత్ శ్రీమణికంఠ ఎడ్లు కైవసం చేసుకొన్నాయి. సీనియర్స్‌కి నగదు ప్రథమ బహుమతి రూ.12 వేల నగదుతోపాటు మెమోంటో, ద్వితీయ బహుమతి రూ.10వేలు నగదుతోపాటు మెమోంటో, తృతీయ బహుమతి రూ.8 వేల నగదుతోపాటు మెమోంటో, జూనియర్స్‌కి నగదు ప్రథమ బహుమతి రూ.10 వేల నగదుతోపాటు మెమోంటో, ద్వితీయ బహుమతి రూ.8 వేల నగదుతోపాటు మెమోంటో, తృతీయ బహుమతి రూ.6 వేల నగదుతోపాటు మెమోంటో ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాల రాజు) చేతుల మీదుగా బహుమతులు, నగదు ప్రదానం అందజేశారు. ఈ నగదు, బహుమతులు, జ్ఞాపికలు చందువోలు నాగరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు చందువోలు రాజా, చింతపల్లి వరహాలు జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యనారాయణ, కోలా వీరబాబు, కోరుకొండ రుద్రయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు కోరుకొండ నూకరాజు, తిరుమాలి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కానూరి బ్రహ్మానందం, మాడెం పెంటయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ధర్మరాజు, పసల సూరిబాబు, ఓలేటి చంటిబాబు, సూతి అప్పలరాజు అందజేశారు.

రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందింది

జనసేన నియోజకవర్గాల్లో డొక్కా సీతమ్మ క్యాంటిన్లు ఏర్పాటుచేయాలి

శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధి హీన్



లంకలగన్నవరం డొక్కా సీతమ్మ నివాసంలో సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధి హీన్

పి.గన్నవరం, జూన్ 14: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా నడిచిన రాక్షసపాలన అంతమొందిందని శ్రీలంక బౌద్ధభిక్షువు బోధి హీన్ అన్నారు. ఏపీలో కూటమి పాలన వస్తుందని ఈనెల 3న తెలంగాణలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో తాను వెల్లడించడం జరిగిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో ఆయన డొక్కా సీతమ్మ నివాసాన్ని సందర్శించి అనంతరం మాట్లాడారు. అన్నక్యాంటీన్‌లను స్వాగతిస్తున్నామని, ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, ఆమేరకు జనసేన గెలిచిన 21 నియోజకవర్గాల్లో సీతమ్మ క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు ఆయన తెలిపారు. కుల, మతాలకు అతీతంగా భోజనాలు అందించిన ఘనత సీతమ్మకు ఉందని ఆయన గుర్తుచేశారు. పవన్‌కల్యాణ్‌కు శ్రీలంకలో భారీగా అభిమానులు ఉన్నారని, ముఖ్యంగా బౌద్ధ బిక్షువులు, ఉపాసకులలో ఎక్కువ శాతం అభిమానులు ఉన్నారన్నారు. అమరావతి అనే పేరు బౌద్ధమతం నుంచే పుట్టిందన్నారు. ఎన్నికల సమయంలో శ్రీలంక నుంచి వచ్చిన పలువురు బౌద్ధ భిక్షువులు అమరావతి తోపాటు రాష్ట్రమంతా పర్యటించామన్నారు. ముఖ్యంగా అమరావతి రైతులను కలిసి కూటమి ప్రభుత్వం వస్తుందని ధైర్యం చెప్పామన్నారు. త్వరలో నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపేందుకు ఏపీ రాజధాని అమరావతికి శ్రీలంక నుంచి బౌద్ధ భిక్షువులు, బౌద్ధ ఉపాసకులు రాబోతున్నారని ఆయన తెలిపారు. వారందరూ సీఎం చంద్రబాబునాయుడిని కలిసి రాష్ట్రంలో ఉన్న 13 ఉమ్మడి జిల్లాలను కలిపి ఒక కేడర్‌గా ఏర్పాటుచేసి, బౌద్ధాన్ని తద్వారా టూరిజాన్ని అభివృద్ధి చేయాలని కోరతారన్నారు.

జెన్కో చీఫ్ ఇంజనీర్‌గా జవహర్



బాధ్యతలు చేపడుతున్న దృశ్యం

మోతుగూడెం, జూన్14: చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్‌గా జవహర్‌ను పదోన్నతిపై నియమిస్తూ విజయవాడ విద్యుత్ సౌధ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఉన్న బొడ్డు శ్రీధర్‌ను విద్యుత్ సౌధలోని ట్రైనింగ్ సెంటర్‌కి బదిలీ చేశారు. నూతనంగా నియమితులైన జవహర్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ సివిల్ కె.ప్రశాంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ వరప్రసాద్, డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతించారు.



ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ

జీవవైవిధ్యం మానవాళికి మూలాధారం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ

దివాన్‌చెరువు, జూన్ 14: జీవవైవిధ్యం మానవాళికి మూలాధారమని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. గుంటూరులోని రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణా కార్యక్రమం లాలాచెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో తెలియజేసి, తద్వారా వారిని జీవవైవిధ్య పరిరక్షణలో భాగస్వాములను చేయాలని కోరారు. జీవవైవిధ్యంపై అవగాహన, దానిని పరిరక్షించుకోవలసిన అవసరం, జీవవైవిధ్యం చట్టాలను వివరించడం ముఖ్యోద్దేశంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. రెండురోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి తొలి రోజు రంపచోడవరం, విశాఖపట్టణం, విజయనగరం, చీరాల తదితర ప్రాంతాల నుంచి యాజమాన్య కమిటీ సభ్యులు హాజరయ్యారు. అలాగే అకాడమీ అధికార్లు వి.శ్రీహరిగోపాల్, ఎన్వీ శివరాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ప్రాంతీయ కోఆర్డినేటర్లు జానకిరామ్, చెన్నకేశవ, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన గూడ్స్‌రైలు డ్రైవర్

అన్నవరం, జూన్ 14: కుటుంబకలహాలు, ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో రైలుపట్టాలపై పడుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధుడిని గూడ్స్ రైలు డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించి సడన్ హ్యాండ్‌బ్రేక్ వేసి అతనిని కాపాడిన ఘటన అన్నవరం రైల్వేస్టేషన్‌లో జరిగింది. చిన్నయ్యపాలెంకు చెందిన పసుపులేటి గంగరాజు (82) దొడ్డిగొల్లులో నివాసం ఉంటుండగా అన్నవరం రైల్వేస్టేషన్ పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సామర్లకోట వైపు వెళుతున్న గూడ్స్‌రైలు డ్రైవర్ గమనించి సడన్ బ్రేక్ వేశారు. విషయాన్ని స్టేషన్‌మాస్టర్ రైల్వే ఎస్.ఐ మారూఫ్‌కు సమాచారమిచ్చారు. రైల్వే హెచ్‌సీ శ్యామ్, ఉపేంద్రలు అన్నవరం చేరుకుని వారి వివరాలతో వృద్ధుడిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

రాజవొమ్మంగి జూన్ 14: రాజవొమ్మంగి మండలంలో శుక్రవారం వర్షం వస్తుందని చెట్టు కింద ఆగిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన ఇది. లాగరాయి గ్రామానికి చెందిన కొల్లి నాగబాబు (30), పెంటకోట దేవకిరణ్ (23) ఏలేశ్వరం నుంచి లాగరాయి వెళుతూ మార్గమధ్యలో వర్షం వస్తోందని లబ్బర్తి గ్రామ సమీపంలో చెట్టు కింద ఆగారు. కాసేపటికి చెట్టుపై పిడుగు పడడంతో నాగబాబు అక్కడికక్కడే మృతి చెందగా, కిరణ్‌కు గాయాలవడంతో స్థానికులు లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యోగా విద్యార్థుల రక్తదానం

కొత్తపేట, జూన్14: శ్రీస్వామి వివేకానందయోగా, వ్యాయామ కళాశాల విద్యార్థులు 34మంది అమలాపురం ప్రభుత్వాసుపత్రిలోని రక్తనిధి కేంద్రానికి రక్తదానం చేశారు. అమలాపురం బ్లడ్ బ్యాంకు ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో రక్తహీనతతో బాధపడుతున్న రోగులకు, ప్రమాద బాధితులకు ఈరక్తాన్ని అందిస్తారని యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు వి.గౌతమ్‌రాజ్, పి.శ్రీను, సతీష్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్, కె.వెంకట్, ఇ.ఉదయ్‌కుమార్, ఎన్.నాగరాజు, ఎం.సూర్య బి.సురేష్, పి.సూర్య పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుపై న్యాయవాదుల హర్షం





ముమ్మిడివరం: కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు, మామిడికుదురు: మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం, మండపేట: చంద్రబాబు, మందా కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

ముమ్మిడివరం, జూన్ 14: సీఎం చంద్రబాబునాయుడు ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేయడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం న్యాయవాదుల సమావేశం జరిగింది. బార్ అసోసియేషన్ చాంబర్‌లో కేక్‌ను కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రాజ్యాంగ వ్యతిరేక చట్టమని న్యాయవాదులు, మేధావులు రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలలు నుంచి అనేక ఉద్యమాలు, నిరసనలు, పోరాటాలు చేసినా గత ప్రభుత్వం లెక్క చేయకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. న్యాయవాదులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ, నామినేటెడ్ పోస్టుల్లో నియామకాలు, సంక్షేమ నిధి పెంపు, న్యాయవాది గుమస్తాల సంక్షేమ, ఆర్థిక తోడ్పాలు వంటి పథకాలను నూతన ప్రభుత్వం అమలు చేయాలని సమావేశం కోరింది. సమావేశంలో మట్టపర్తి వెంకటేశ్వరరావు, రామాయణం మనేశ్వరరావు, గంటి శ్రీధర్‌బాబు, పలివెల నరేష్‌కుమార్, గోనమండ వెంకటేశ్వరరావు, జీవీవీ రామారావు, కేఎల్‌వీ ప్రసాదరావు, గుత్తుల శ్రీనివాసరావు, అయినవిల్లి వలియాబాబు, కుచ్చర్లపాటి తాతంరాజు, కేఆర్కే రాజు, రెడ్డి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

చిత్రపటాలకు పాలాభిషేకం

పి.గన్నవరం, జూన్14: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో చంద్రబాబు నేతృత్వంలో పవన్ ఆశయాలతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. లంకలగన్నవరంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు స్థానిక టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు లంకే చిరంజీవి, వేమన రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, గనిశెట్టి ఈశ్వర్, కొపనాతి సీతారామస్వామి, గూటం రత్నంరాజు, యల్లమిల్లి నాగేంద్ర, కామాడి రామకృష్ణ, యన్నాబత్తుల వెంకటేశ్వరావు, పిల్లి స్వామి, పెదపూడి దుర్గాప్రసాద్, బండారు చిన్నా, శేరు పోతురాజు, వేమన గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

మామిడికుదురు, జూన్ 14: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మామిడికుదురులోని టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్రమోదీల చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, సుందరనీడి చిన్నీ, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, నాయకులు సూదా బాబ్జి, బోనం బాబు, చుట్టుగుళ్ల కిశోర్, జాలెం సుబ్బారావు, గంధ భాస్కర్, కాకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు సంతకాలపై ప్రశంసలు

మలికిపురం, జూన్ 14: ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నారని టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, పార్టీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మండల ప్రధాన కార్యదర్శి రాపాక నవరత్నం అన్నారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, పింఛను పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్‌సెన్సెస్‌పై సంతకం చేయడం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో కూటమి నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.

ఐదు సంతకాలతో భరోసా

అంతర్వేది, జూన్ 14: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారని నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు అన్నారు. సఖినేటిపల్లి మండల టీడీపీ నాయకులు తాడి సత్యనారాయణ, ముప్పర్తి నాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామ్మోహనరావు, గుండుబోగుల పెదకాపు మాట్లాడారు. చంద్రబాబు గురువారం బాధ్యతలు స్వీకరించి మెగాడీఎస్సీపై, ల్యాండ్ టైట్లింగ్‌యాక్టు రద్దు, సామాజిక పింఛన్ పెంపు, అన్నక్యాంటీన్లు పునరుద్ధరణ, స్కిల్‌సెన్సెస్ ఫైళ్లపై సంతకం చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ముదునూరి చినబాబురాజు, మంగెన భూదేవి, అడబాల యుగంధర్, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, పోతురాజు కృష్ణ, గుబ్బల ఫణికుమార్, రాపాక నవరత్నం, చెల్లింగి లీలాశ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

మండపేట, జూన్ 14: సీఎం చంద్రబాబు దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచడాన్ని స్వాగతిస్తూ మండపేటలో దివ్యాంగులు సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. స్థానిక దివ్యాంగులు భవనం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దివ్యాంగ సంఘ నాయకులు జిల్లా దివ్యాంగ సంఘ అధ్యక్షుడు ఎస్.కెనబి, బొజ్జా వీరవెంకటరామకృష్ణ, ఎం.రాంబాబు, బేవర తాతారావు, షేక్ నూరిబాబు, జొన్నాడ పాపమ్మ, సిద్దాంతపు చిట్టెమ్మ, టీడీపీ, జనసేన నాయకులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుపై హర్షం

అమలాపురం టౌన్, జూన్ 14: భూ హక్కు చట్టాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడం పట్ల ఇండియా కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జగన్ దుర్మార్గంగా తీసుకువచ్చిన చట్టాన్ని రద్దు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబీ, వడ్డి నాగేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాస్, యార్లగడ్డ రవీంద్ర, రాయుడు వెంకటరమణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

గిడ్డి సత్యనారాయణకు శుభాకాంక్షలు

పి.గన్నవరం, జూన్ 14: నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణను కలిసి దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డాక్టర్ షేక్ జాసియ్, డాక్టర్ మహమ్మద్ రియాతున్నిషా బేగం, డాక్టర్ వై.ప్రియాంక, డాక్టర్ మౌనిక, సిబ్బంది ఎ.నాగరాజు, శ్రీనివాసరెడ్డి, బీవీఎస్ఎన్ మూర్తి, ఎం.శ్యామ్యూల్‌రాజు ఉన్నారు.

పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్14: స్థానిక జవహర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రేరణ పోటీలకు ఎంపికైన దుగ్గిరాల శివనవ్యశ్రీని వేగుళ్ల సత్కరించారు. 17వవార్డు కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్యభవాని, శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పాలచర్ల శిరీష్, కె.అప్పన్నబాబు, నాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్స్ పంపిణీ

రాయవరం, జూన్ 14: రాయవరం శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం వి.శాంతి సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ గంటి రోజా, టీడీపీ నేత, వార్డుమెంబరు వుండవిల్లి రాంబాబు పుస్తకాలను అందజేశారు. ఎంఈవోలు పి.రామలక్ష్మణ మూర్తి వై.సూర్యనారాయణ, స్థానిక కూటమి నేతలు నల్లమిల్లి రాజేష్, దేవిశెట్టి చిన్ని, దేవిశెట్టి కరుణకుమార్, బర్ల రాజు, నేతల సురేష్, వల్లూరి శ్రీనివాస్, నూలు సత్యనారాయణ, మల్లిడి చిన్ని, పాఠశాల సెక్రటరీ పి. సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మామిడికుదురు, జూన్ 14: ప్రజలందరూ ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లూటుకుర్రు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ యేడిద కవీంద్ర అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా పాశర్లపూడిలంకలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఏఎన్ఎం కస్తూరి, ఎంపీహెచ్ఈవో ప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా చంద్రబాబు

రాయవరం, జూన్ 14: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లు పెంపుదలచేసి దివ్యాంగులకు చంద్రబాబు అండగానిలిచారని దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇండవిల్లి భరత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచి చంద్రబాబు దివ్యాంగులకు భరోసాగా నిలిచారని కొనియాడారు. పింఛన్ పెంపుదలపై హర్షం వ్యక్తం చేశారు.

ఐదో ప్రవక్తకు ఘన నివాళి

మామిడికుదురు, జూన్ 14: ముస్లింల ఆరాధ్య దైవం, ఐదో ప్రవక్త హజరత్‌ఇమామ్ మహ్మద్‌బాకర్‌కు ఘననివాళులర్పించారు. శుక్రవారం నగరం గ్రామంలోని బార్గాహే పంజా వద్ద మంజిలే కర్బలాలో మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్ బాకరీ మజ్లిస్ ఆలపిస్తూ ఇమామ్ బాకర్ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, మహిమలను భక్తులకు వివరించారు.

ఎంపీ పురందేశ్వరితో మల్లాడి భేటీ



యానాం, జూన్ 14: ఎన్టీఆర్ కుమార్తె, ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాఖ అధ్యక్షురాలు, రాజమండ్రి లోక్‌సభ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరితో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భేటీ అయ్యారు. విజయవాడలో కలిసిన మల్లాడి ఎంపీగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం పట్ల ఆమెను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. విజయవాక ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. మల్లాడి వెంట విజయవాడకు చెందిన ప్రముఖ శిల్పి బీఎస్‌పీ ప్రసాద్ ఉన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

మండపేట, జూన్ 14: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం విద్యుత్, రహదారులు భవనాల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ, రహదారులు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాడైన రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. కపిలేశ్వరపురం మండలంలో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉందని అధికారులు వేగుళ్ల దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి 78 ట్రాన్సుఫార్మర్లు అవసరమని అధికారులు చెప్పారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

పెద్దమ్మతల్లికి మొక్కు చెల్లింపు

మండపేట, జూన్ 14: మండపేట నుంచి వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా నాల్గవసారి విజయం సాధిస్తే, కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం వస్తే మండపేట ఏడిదరోడ్డులో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో 108కొబ్బరి కాయలు కొడతానని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మొక్కుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్లతో కలిసి ఆయన పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. కోనా దంపతులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. 108కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్టీ వాలిన వీరబాబు, ట్రస్టుసభ్యులు వేగుళ్లకు బెల్లంతో తులాబారంతో ఆలయంలో మొక్కు చెల్లించారు. తొలుత వేగుళ్లకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. కూటమి నేతృత్వంలో రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలని వేగుళ్ల ఆకాంక్షించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వాకచర్ల గుప్తా, బొడ్డు రామకృష్ణ, చింతల శ్రీను, మండపూడి చంద్రశేఖర్, ప్రసాద్, కొడగట్లపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో రక్తదాన శిబిరం

రాజోలు, జూన్ 14: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కోనసీమ బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని అధ్యక్షుడు కాండ్రేగుల నరేంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో 70మంది రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో బోళ్ల రాజేష్, నార్కేడుమిల్లి విష్ణు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూన్ 14: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవనానికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కూనపరెడ్డి వెంకటప్రసాద్-ధనలక్ష్మిదంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా శుక్రవారం ఆదాయం రూ.2,75,346 వచ్చింది.

హామీల అమలుకు టీడీపీ కట్టుబడి ఉంది: బండారు



రావులపాలెం, జూన్ 14: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు టీడీపీ కట్టుబడి ఉందని కొత్తపేట ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబుకు, మంత్రివర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. జగన్ అండ్ కో ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. జగన్ పాలనపై విసుగెత్తిన ప్రజలు వైసీపీని పాతాళానికి తొక్కారనడానికి నిదర్శనమే ఈఎన్నికల ఫలితాలన్నారు. కొత్తపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి బాటలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, గుత్తుల పట్టాభిరామారావు, పడాల బులికొండారెడ్డి, కాసురెడ్డి, తిక్కిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తా



ఆత్రేయపురం, జూన్ 14: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఎంతో మహిమాన్వితుడని, కోనసీమ తిరుమలగా అలరారుతున్న ఈ క్షేత్రాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తొలిసారిగా స్వామివారిని దర్శించుకున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు వందల సంఖ్యలో తరలివచ్చి బండారుకు ఘన స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం సత్యానందరావు-కమలారాణి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయం ఎదురుగా జరుగుతున్న పుష్కరిణి పనులను ఆయన పరిశీలించారు. ఆలయంలో చేపడుతున్న పనులపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు. ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆలయ అభివృద్ధి పనులను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, జనసేన ఉపాధ్యక్షుడు బండారు బాబీ, అల్లు వెంకరమణ, శంకర్ పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గానికి మంత్రి సుభాష్ రాక


రామచంద్రపురంలో ఏర్పాటుచేసిన స్వాగత ద్వారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం నియోజకవర్గానికి రానున్నారు. మధ్నాహ్నం 2గంటలకు జొన్నాడ నుంచి విజయోత్సవ యాత్ర ప్రారంభమవుతుంది. ఆలమూరు, మండపేట, పులుగుర్త, మాచవరం మీదుగా రామచంద్రపురం, తాళ్లపొలం జగన్నాయకులపాలెం మీదుగా ద్రాక్షారామ వరకు విజయోత్సవ యాత్ర కొనసాగుతుంది. సుభాష్ స్వాగతం పలికేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యారు. రామచంద్రపురం బైపాస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డులో అడుగడుగునా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. రామచంద్రపురం నుంచి ద్రాక్షారామ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. పలు కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. క్రేన్లతో భారీ గజమాలలు వేసేందుకు అభిమానులు ఏర్పాట్లుచేస్తున్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరానున్న శ్రేణులు: వేలాది మందితో విజయోత్సవ ర్యాలీ జరుగుతుంది. విజయోత్సవ యాత్రకు అభిమానులు, పార్టీల కార్యకర్తలు తరలిరావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ పిలుపు నిచ్చారు.

సుభాష్ రాక కోసం స్వాగత ఏర్పాట్లు

మండపేట, జూన్ 14: రామచంద్రపురం నియోజకవర్గానికి ఆదివారం వస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు మండపేటలో ఘనస్వాగతం పలికేందుకు సుభాష్ అభిమానులు, పార్టీ శ్రేణులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నేతృత్వంలో కూడా స్వాగతం ఏర్పాట్లు చేస్తున్నారు.

సుభాష్‌కు కార్మికశాఖ కేటాయింపుపై హర్షం

కె.గంగవరం, జూన్14: వాసంశెట్టి సుభాష్‌కు కార్మిక శాఖ కేటాయించడంపై టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, మరివాడ సూరిబాబు, దేవరపల్లి బుల్లి, మరివాడ చిన్నికృష్ణ, సలాది రమేష్, రావిపాటి వెంకటగణేష్ చౌదరి, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ చౌదరి, బీజేపీ నాయకులు నున్న సత్యనారాయణ, జనసేన నాయకులు దేవరపల్లి చక్రి, చిర్రా రాజ్‌కుమార్ హర్షం ప్రకటించారు. నియోజవర్గానికి వస్తున్న మంత్రి సుభాష్‌కు స్వాగతం పలకాలని బీజేపీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి పిలుపునిచ్చారు. జొన్నాడ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీకి పార్టీ నాయకులు,కార్యకర్తలు తరలిరావాలన్నారు.

పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువస్తాం

అల్లవరం, జూన్ 14: పంచాయతీల రూపురేఖలు మార్చి పంచాయతీ వ్యవస్థకు పూర్వ వైభవంతీసుకొస్తామని అమలాపురం ఎంపీ విజేత జి.హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావు అన్నారు. శుక్రవారం వారిని అల్లవరం మండల సర్పంచ్‌ల సమాఖ్య ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ పాలనలో సర్పంచ్‌ల వ్యవస్థ నిర్వీర్యమైందని, టీడీపీ పాలనలో పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే విజేతలను అల్లవరం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, నడింపల్లి సుబ్బరాజు, దాకారపు చిరంజీవిరావు, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, తోట శ్రీదేవి, సుందరనీడి సాయికృష్ణ, రొక్కాల విజయలక్ష్మి, ఉండ్రు భగవాన్‌దాస్, బర్రే సీతారత్నం, వడ్డి సుభాషిణి, రాకాపు విజయలక్ష్మి, మల్లాడి మంగాయమ్మ సత్కరించారు.

ఐటీఐ దరఖాస్తుదారులకు 18న ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, జూన్ 14: జిల్లాలో అన్ని ప్రైవేటు ఐటీఐల్లో 2024-25 సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల18న ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 9గంటలకు అమలాపురం ఉపాధి శిక్షణా సంస్థ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు

అమలాపురం టౌన్, జూన్ 14: అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో పాటు జిల్లాలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా శాఖ సమావేశం అభినందనలు తెలిపింది. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా శాఖ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మంత్రిగా నియమితులైన వాసంశెట్టి సుభాష్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన ప్రజాప్రతినిధులు కృషి చేస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి పీవీ గోపాలం, రాష్ట్ర నాయకులు బీవీవీఎస్ మూర్తి, ఎస్.రాజరాజేశ్వరీదేవి, విత్తనాల శ్రీనివాస్, కడలి వెంకటేశ్వర్లు, పెచ్చెట్టి శ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు. నూతన ప్రజాప్రతినిధులను కలుసుకుని ఉద్యోగుల సమస్యలను వివరించేందుకు నిర్ణయించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: రక్షణ
శేఖర్ స్క్రీన్-1	: ప్రేమించొద్దు
శేఖర్ స్క్రీన్-2	: బ్యాడ్‌బాయ్స్
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సత్యభామ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీఎం ఉష గ్రాంట్‌కు ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14: రామచంద్రపురంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాల పీఎం ఉష గ్రాంట్‌కు ఎంపిక కావడంపై సీపీడీసీ సభ్యులు ప్రథమ సమావేశం హర్షం ప్రకటించింది. శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సి.సత్యలత అధ్యక్షతన సీపీడీసీ ప్రథమ సమావేశం జరిగింది. పీఎం ఉష గ్రాంట్‌కు ఎంపిక కావడంతో కళాశాలలో అదనపు భవనాలు నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. సమావేశంలో సీపీడీసీ సభ్యులు అడ్డూరి జగన్నాధవర్మ, గిరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, డాక్టర్ కాదా వెంకటరమణ, డాక్టర్ శిష్టా అమ్మన్న పంతులు, డాక్టర్ సి.స్టాలిన్, విశ్రాంత భౌతికశాస్త్ర అధ్యాపకులు ఎన్ఎల్‌డీఆర్కే ప్రసాద్, బీవీవీ సాగర్ పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధికి అందరూ సహకరిస్తామని హామీ ఇచ్చారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఆత్రేయపురం, జూన్14: పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా మెర్లపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. హెచ్ఎం శ్యామ్‌కుమార్ పర్యావరణంపై అవగాహన కల్పించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

అమలాపురం టౌన్, జూన్ 14: ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని కిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ వైద్య విద్యార్థులతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పీఎస్ శర్మ మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. ఆపదలో ఉన్న వారికి పునర్జన్మ ప్రసాదించవచ్చన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారిని సత్కరించారు. కిమ్స్ వైద్యులు దివ్య, జ్యోతి, ప్రసన్న పాల్గొన్నారు.

20మంది రక్తదానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్14: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాబ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో 20మంది రక్తదానం చేశారు. 50మంది బ్లడ్‌గ్రూపు అందజేసి అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రక్తదాన శిబిరాన్నిబ్లడ్‌డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి ప్రారంభించారు. సభ్యులు చంద్రశేఖర్, సత్తిరెడ్డి, రవికుమార్, ఆండ్ర ప్రకాష్, వెంకటేశ్వరరావు తదితరులు రక్తదానం చేశారు. బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు తొగరు మూర్తి, బ్లడ్ బ్యాంకు డాక్టరు సునీత, సిబ్బంది చింతపల్లి వాసు, ప్రభాకర శర్మ, శ్రీనివాసు పాల్గొన్నారు.

హిమాన్ష్ శుక్లా వారధిగా నామకరణం

మామిడికుదురు, జూన్ 14: పాశర్లపూడిలంక, లూటుకుర్రు గ్రామాలను కలుపుతూ వాడబోది డ్రెయిన్‌పై నిర్మిస్తున్న వంతెనకు హిమాన్షు శుక్లా రామసేతు వారధిగా నామకరణం చేసి గ్రామ పంచాయతీ సభ్యులు తీర్మానం చేశారు. జిల్లా కలెక్టర్ కృషి వల్లే వంతెన నిర్మాణం సాధ్యమైందని, నిర్మాణానికి రూ.1.20కోట్లు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈవంతెన నిర్మాణం వల్ల లూటుకుర్రు, కొమరాడ, మాకనపాలెం, ఆదుర్రు, మగటపల్లి, గోగన్నమఠం ప్రజల కష్టాల తీరనున్నాయి. పాశర్లపూడిలంక గ్రామ పంచాయతీ ప్రజలు పంచాయతీ తీర్మానం ద్వారా హిమాన్షు శుక్లా రామసేతు వారధిగా నామకరణం చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు తెలిపారు. గతంలో మామిడికుదురు-అప్పనపల్లి మధ్య కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిర్మించిన వారధికి ఆ ప్రాంత ప్రజలు శుక్లా వారధిగా నామకరణం చేశారు.

శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించాలి

అయినవిల్లి, జూన్ 14: తొత్తరమూడి వారావారిపేట శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని, ఆక్రమణలు తొలగించాలని ఆ గ్రామస్తులు తహసీల్దార్, ఎంపీడీవో, సబ్ ఇనస్పెక్టర్‌లకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. శ్మశానవాటికకు ఒక పక్క గోదావరి పాయ ఉండగా మరో పక్క కౌలు రైతు బొప్పాయి తోటవేసి కర్రలతో దడి కట్టడంతో శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి శ్మశాన వాటికను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కొంకి వెంకట్రావు, ఎం.సతీష్‌కుమార్, వి.రాజారావు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఎంపీ హరీష్‌మాధుర్‌కు అభినందనలు


ఎంపీ హరీష్‌మాధుర్‌ను కలుసుకున్న డీపీవో రాంబాబు, కార్యదర్శులు

అమలాపురం టౌన్, జూన్ 14: అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్‌ను ఆయన స్వగృహంలో శుక్రవారం వివిధ ప్రాంతాలకు చెందిన వారు కలుసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా శాఖ ప్రతినిధులు ఎంపీని సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్పీవో పి.బొజ్జిరాజు, జిల్లా సంఘ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్, ప్రచార కార్యదర్శి సింగంపల్లి దుర్గాశ్రీనివాస్, కార్యదర్శులు రెడ్డి శిరీష, పరంశెట్టి ఆదినారాయణ, పరంశెట్టి శ్రీను, ఏఎస్‌వీఎస్ రాజేశ్వరరావు (రాజా), దారా రామకృష్ణ, గుత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, గోకరకొండ హరిబాబు, కార్యదర్శి కొమ్మూరు వెంకటాచలప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీ హరీష్‌ను సత్కరించారు. దొమ్మేటి సాయిబాబు, వలవల శివరావు, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, నంబూరి నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలి

ముమ్మిడివరం, జూన్ 14: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కూటమి ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నిస్తే ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంటు జిల్లా చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు పేర్కొన్నారు. భూహక్కు చట్టం రద్దు కోసం చేపట్టిన ఉద్యమ స్ఫూర్తితోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కూడా సాధించాలన్నారు. భూహక్కు చట్టాన్ని కొత్త ప్రభుత్వం రద్దు చేయడం అభినందనీయమన్నారు.

బిల్లుకలెక్టర్ మృతి

అల్లవరం, జూన్ 14: అల్లవరం పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.సూర్యవంశరాజు(57) గురువారంసాయంత్రం మృతిచెందారు. ఆయన మృతికి ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, సర్పంచ్ బొమ్ము బాలవేణి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్, రాణి, సిబ్బంది సంతాపం తెలిపారు.

బండారును అభినందించిన ముస్లిం నాయకులు

కొత్తపేట, జూన్ 14: కొత్తపేట ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావును శుక్రవారం వాడపాలెంలోని ఆయన స్వగృహంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మీరాన్‌షరీఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. బండారును పూలమాలలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ షామాఅబ్బు, షేక్ జహంగీర్, షేక్ మునీర్, షేక్ హుస్సేన్, షేక్ మీరాసా, ఎండీ రహ్మాన్, షేక్ బాషా, ఎండీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పూజలు

అంతర్వేది, జూన్ 14: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమలాపురం ఆర్డీవోజీ.కేశవర్ధనరెడ్డి శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. ఆర్ఐ రామరాజు, వీఆర్వో ప్రసాద్, సీసీ వెంకట్ పాల్గొన్నారు.

గజమాల యాత్రను విజయవంతం చేయండి

రాజోలు, జూన్ 14: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల17న జరగబోయే మహాగజమాల యాత్రను విజయవంతం చేయాలని రాజోలు తాలూకా యువజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, ఏ1 సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పొదలాడలో గజమాల యాత్ర కరపత్రాలను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. శ్రీబాలబాలాజీ స్వామివారి ఆలయ నిర్మాతమొల్లేటి రామస్వామి శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని రామస్వామి దంపతుల విగ్రహాలకు అలంకరించే గజమాల యాత్రలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తాటిపాకలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం భవనం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై మహా గజమాల యాత్ర బయలుదేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో చెల్లుబోయిన రాంబాబు, పితాని సురేంద్ర, వాసంశెట్టి రామకృష్ణ, కాండ్రేగుల శ్రీనివాస్, నయినాల కాశి, వాసంశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆనందరావుకు అభినందనలు

అమలాపురం టౌన్, జూన్ 14: అమలాపురం ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో విజయం సాధించిన అయితాబత్తుల ఆనందరావును శుక్రవారం పలువురు కలుసుకుని అభినందనలు తెలిపారు. మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను ఆధ్వర్యంలో కౌన్సిలర్లు పడాల శ్రీదేవి, పిండి అమరావతి, గండి దేవిహారిక, గొలకోటి విజయలక్ష్మి, తిక్కా సత్యలక్ష్మితో పాటు పలువురు జనసేన నాయకులు ఆనందరావును సత్కరించారు. జనుపల్లికి చెందిన నాయకులు కొలిశెట్టి సూరిబాబు ఆధ్వర్యంలో మారిశెట్టి తారకభూషణం, గెడ్డం త్రిమూర్తులు, పిల్లా సత్తిరాజు, కొలిశెట్టి త్రిమూర్తులు, కొలిశెట్టి రామకృష్ణ తదితరులు ఆనందరావును సత్కరించారు. టీడీపీ యువ నాయకుడు నల్లా మల్లిబాబు ఆధ్వర్యంలో అనుపోజు శ్రీనివాస్, గంధం శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు.